నేత్రపర్వం.. రాములోరి అలంకారం



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-14లోని శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ధనుర్మాస ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా సోమవారం 24వ పాశురం, మంగళహారతి, విశేష సహస్ర దీపాలంకరణ సేవ కనుల పండువగా జరిగాయి. శ్రీగోదా రంగనాథ స్వామి దివ్య అలంకారాన్ని భక్తులు దర్శించుకున్నారు. అయోధ్య శ్రీరాముడి అలంకరణ ఈ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇందులో భాగంగా భక్తులకు 21 రకాల ప్రసాద వితరణ జరిగింది. విశేష పూజల్లో తెల్లవారుజాము నుంచే భక్తులు భారీగా పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు అద్దంకి శశికాంత్ ఆచార్యులు నేతృత్వంలో ఈ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తజన సందోహంతో ఆలయం కిటకిటలాడగా పరిసరాలు ఆధ్యాత్మికతను సంతరించుకున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 11న కూడారై ఉత్సవం, 12న శ్రీగోదా రంగనాథ స్వాముల కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు శశికాంత్ ఆచార్యులు తెలిపారు.

76674 ప్రజాపాలన దరఖాస్తులు.. ఆన్‌లైన్ నమోదు ముమ్మరం

- డేటా ఎంట్రీ కోసం 180 కంప్యూటర్లు
- పనిచేస్తున్న 180 మంది ఆపరేటర్లు
- మూడు షిఫ్ట్‌ల్లో విధుల నిర్వహణ



జీహెచ్‌ఎంసీ సర్కిల్-15 కార్యాలయంలో దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదును పరిశీలిస్తున్న తిప్పర్తి యాదయ్య

ముషీరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా అభయ హస్తం కార్యక్రమం కింద ఆరు గ్యారంటీ పథకాలకు ప్రజల నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది. గత నెల 28వ తేదీ నుంచి జనవరి 6వ తేదీ వరకు ఎనిమిది రోజుల పాటు దరఖాస్తులను స్వీకరించారు. ముషీరాబాద్ నియోజకవర్గంలోని ఆరు డివిజన్లలో ఒక్కో డివిజన్‌లో నాలుగు కేంద్రాల చొప్పున మొత్తం 24 కేంద్రాలు ఏర్పాటు చేసి దరఖాస్తులను స్వీకరించారు. ఒక్కో కేంద్రానికి ఒక ఇన్‌చార్జి, మరో ఐదుగురు సహాయకులను నియమించి కేంద్రాల వద్ద బారికేడ్‌లు, పోలీసు బందోబస్తు, మంచినీటి వసతి, దివ్యాంగులకు వీల్ చైర్‌లు ఏర్పాటు చేసి దరఖాస్తుదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దరఖాస్తులను స్వీకరించారు. దీనికి ప్రజల నుంచి మొదటి రోజు నుంచి చివరి రోజు వరకు విశేష స్పందన లభించింది.

◆ ఆరు గ్యారంటీ పథకాలకు ఎనిమిది రోజుల్లో 56907 దరఖాస్తులు, రేషన్ కార్డులు ఇతర వాటి కోసం 16,767 దరఖాస్తులు మొత్తం 76674 దరఖాస్తులు 24 కేంద్రాల ద్వారా జీహెచ్‌ఎంసీ సర్కిల్-15 అధికారులు స్వీకరించారు.

180 కంప్యూటర్లు..

నియోజకవర్గంలో స్వీకరించిన దరఖాస్తులను కంప్యూటర్‌లో నిక్షిప్తం చేయడం కోసం జీహెచ్‌ఎంసీ సర్కిల్-15 అధికారులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. దరఖాస్తుల స్వీకరణ ముగిసిన వెంటనే అబిడ్స్‌లోని జీహెచ్‌ఎంసీ సర్కిల్-15 కార్యాలయంలో 180 కంప్యూటర్‌లను, దానికి ఆపరేట్ చేసేందుకు 180 మంది డీటీపీ ఆపరేటర్లను నియమించారు.

◆ ఉదయం 6 గంటల నుంచి 2 గంటల వరకు ఒక షిఫ్ట్, మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు రెండవ షిఫ్ట్, రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు మూడవ షిఫ్ట్‌ను ఏర్పాటు చేసి మూడు షిఫ్ట్‌ల్లో ప్రజా పాలన కింద వచ్చిన దరఖాస్తులను కంప్యూటర్‌లో ఎంట్రీ చేస్తున్నారు. ఈ ప్రక్రియ ఈ నెల 17వ తేదీ వరకు ముగిసే అవకాశం ఉంది.

యుద్ధప్రాతిపదికన నమోదు



ఆరు గ్యారంటీ పథకాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ప్రజా స్పందనకు తగ్గట్టుగా నియోజకవర్గంలో 24 కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దరఖాస్తులను స్వీకరించాం. వచ్చిన దరఖాస్తులను మూడు షిఫ్ట్‌ల్లో యుద్ధప్రాతిపదికన కంప్యూటర్లలో పొందుపరుస్తున్నాం. ప్రభుత్వం నుంచి తదుపరి ఉత్తర్వుల మేరకు కార్యాచరణను రూపొందిస్తాం.

– తిప్పర్తి యాదయ్య, డీఎంసీ

బీజేపీలో ఆప్ నేతల చేరిక



బీజేపీలో చేరిన వారితో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

అంబర్‌పేట్: బీజేపీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం ఉంటుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. సోమవారం నగర పార్టీ కార్యాలయంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గౌతమ్‌రావు ఆధ్వర్యంలో పలువురు పార్టీలో చేరారు. వారికి బీజేపీ కండువా కప్పి పార్టీలోకి చేర్చుకున్నారు. పార్టీలో చేరిన వారిలో ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ హరిచరణ్, డాక్టర్ పుట్ట పాండు రంగయ్య, మండడి శ్రీనివాస్‌రెడ్డి ప్రవీణ్‌కుమార్ యాదవ్‌లతో మరో వంద మంది ఉన్నారు. పలువురు అంబర్‌పేట బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టీఎస్‌సీపీడీసీఎల్ 11కేవీ ఆజామ్‌బాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతు పనుల నిమిత్తం పలు ప్రాంతాలలో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏడీఈ విజయ్‌భాస్కర్ తెలిపారు. బర్కత్‌పురా బస్ డిపో ఫీడర్ పరిధిలో ఫీవర్ ఆస్పత్రి, బర్కత్‌పురా బస్‌డిపో, రత్నానగర్, సత్యానగర్, బీజేపీ ఆఫీస్, అవంతి డిగ్రీకాలేజ్, కాచిగూడ జూనియర్ కాలేజ్, హండ్‌లాండ్ హాస్పటల్ తదితర ప్రాంతాలలో ఉదయం 9.30 నుంచి 11.30 వరకు, సీసీ షరఫ్ ఫీడర్ పరిధిలో సీసీ షరఫ్ హాస్పటల్, భూమన్నగల్లి, రాజేంద్రనగర్ కాలనీ, లింగంపల్లి ప్రాంతాల్లో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు విద్యుత్ ఉండదన్నారు. హరాజ్‌పెంట ఫీడర్ పరిధిలో సుందర్‌నగర్, శ్యామ్‌నగర్, క్రీమిటోరియం తదితర ప్రాంతాలలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 వరకు, నెహ్రూనగర్ ఫీడర్ పరిధిలో నెహ్రూనగర్, కృష్ణానగర్, గోల్నాక చర్చి తదితర ప్రాంతాలలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏడీఈ వివరించారు.

ఆర్టీసీని తక్షణమే విలీనం చేయాలి



మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి హనుమంతుముదిరాజ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణలో ఆర్టీసీని తక్షణమే ప్రభుత్వంలో విలీనం చేయాలని తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ (టీజేఎంయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.హనుమంతు ముదిరాజ్ డిమాండ్ చేశారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టీజేఎంయూ సెంటర్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా హనుమంతు ముదిరాజ్ మాట్లాడుతూ... పెండింగ్‌లో ఉన్న 2017–21 పేస్కేల్‌ను తక్షణమే విడుదల చేయాలని కోరారు. సీసీఎస్, ఎస్ఆర్‌బీఎస్, ఎస్‌బీటీలకు పెండింగ్‌లో ఉన్న రూ. 3 వేల కోట్లను తక్షణమే రిలీజ్ చేయాలన్నారు. కారుణ్య నియామకాలను తక్షణమే చెపట్టాలని డిమాండ్ చేశారు. బలవంతపు వీఆర్ఎస్‌ను తక్షణమే ఉపసంహరించుకొని తిరిగి వీఆర్ఎస్ తీసుకున్న కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. టీజేఎంయూ అధ్యక్షుడు టి.సుధాకర్, ముఖ్య ఉపాధ్యక్షుడు డి.వి.కె.రావు, సంయుక్త కార్యదర్శి సీనయ్య, సామెల్, రాష్ట్ర కార్యదర్శి పి.కె.మూర్తి, గీతరవీందర్, ఎం.డి.అతీక్, నరేందర్, సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



వికసిత భారత్ ప్రచార రథాన్ని ప్రారంభించిన సుప్రియనవీన్‌గౌడ్, శ్యామ్‌సుందర్‌గౌడ్

ముషీరాబాద్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియ నవీన్‌గౌడ్ అన్నారు. సోమవారం ముషీరాబాద్ గంగపుత్ర కాలనీలో వికసిత భరత్ సంక్షేమ పథకాల ప్రచార రథాన్ని బీజేపీ మహంకాళీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యామ్‌సుందర్‌గౌడ్, సి.కె.శంకర్‌రావులతో కలిసి కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పేదల కోసం పక్కా గృహాలు, ఉజ్వల గ్యాస్ కనెక్షన్, సురక్షిత మంచినీటి సరఫరా, పీఎం జన్‌ధన్ యోజన, సురక్ష బీమా యోజన, జీవన జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్, పీఎం స్వానిధి, అయుష్మాన్ భారత్ తదితర పథకాలను ప్రధాని నరేంద్రమోడీ ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వికసిత భారత్ ద్వారా ముషీరాబాద్‌లోని అన్ని ప్రాంతాలలో ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన పథకాలను ప్రచారం చేస్తూ సద్వినియోగం చేసుకునేలా తమ వంతు కృషి చేస్తున్నాం అన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ రమేష్‌రాం, జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్, బీజేపీ రాష్ట్ర నాయకులు సదానంద్‌ముదిరాజ్, జమాల్‌పురి నందు, పార్థసారథి, ఆర్.విశ్వం, నగర నాయకులు చంద్రమోహన్, అనిల్‌కకుమార్, సత్యానారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ రాములోరి అక్షింతల పంపిణీ



అక్షింతలను పంచుతున్న పరుశురాం

కవాడిగూడ: దోమలగూడ వినాయకనగర్ బస్తీలో బీజేపీ ఓబీసీ మోర్చా ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ పి. పరుశురాం ఆధ్వర్యంలో అయోధ్య శ్రీ భవ్య రామమందిరంలో ప్రాణ ప్రతిష్ట పూజిత అక్షింతలను ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పరుశురాం మాట్లాడుతూ... దాదాపు ఐదు శతాబ్దాల తరువాత అయోధ్యలో రామమందిర నిర్మాణాన్ని చేపట్టడం శుభపరిణామం అన్నారు. 22వ తేదీన ప్రతి ఇంటి ముందు 5 దీపాలను వెలిగించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రేమ్‌కుమార్, ఈశ్వర్, కిషోర్, శివ తదితరులు పాల్గొన్నారు.

పొదుపు సంఘాలకు స్టేషనరీ పంపిణీ



స్టేషనరీ పంపిణీ చేస్తున్న కావ్య కిషన్‌రెడ్డి

అంబర్‌పేట్: మహిళాలు ఆర్థికంగా ఎదిగినపుడే కుటుంబాలు అన్ని విధాలా పటిష్టంగా ఉంటాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్య కిషన్‌రెడ్డి తెలిపారు. సోమవారం బాగ్‌అంబర్‌పేట డివిజన్ రామకృష్ణనగర్ కమ్యూనిటీ హాల్‌లో పొదుపు సంఘాల సభ్యులకు కావాల్సిన స్టేషనరి సామగ్రిని ఆమె పంపిణీ చేశారు. పొదుపు సంఘాల్లో ఏమైనా సమస్యలు ఉంటే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. బీజేపీ నాయకులు చుక్క జగన్, సునంద, కవితా, వరలక్ష్మి, కనకలక్ష్మి, సుజాత, సునీతలక్ష్మి, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎండోమెంట్ సెల్ కన్వీనర్‌గా సూర్యప్రకాష్



సూర్యప్రకాశ్‌కు నియామకపత్రం అందజేస్తున్న ప్రేమేందర్‌రెడ్డి

నల్లకుంట: బీజేపీ ఎండోమెంట్ సెల్ కన్వీనర్‌గా నల్లకుంటకు చెందిన సూర్య ప్రకాష్ అన్నావజుల నియమితులయ్యారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్ రెడ్డి సోమవారం ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సూర్య ప్రకాష్ మాట్లాడుతూ... తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను అందరి సహకారంతో విజయవంతంగా నిర్వహిస్తానని చెప్పారు. ఈ బాధ్యతలు అప్పగించినందుకు కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, ఎంపీ బండి సంజయ్, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్.ప్రభాకర్, మహిళా మోర్చా అధ్యక్షురాలు గీతామూర్తిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

అశోక్‌కు జేఎన్టీయూ డాక్టరేట్



అంబర్‌పేట్: జేఎన్టీయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న నల్లగొండ అశోక్‌కు జేఎన్టీయూ నుంచి డాక్టరేట్ లభించింది. మహబూబాబాద్ జిల్లా కేసముద్రంకు చెందిన అశోక్ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ప్రొఫెసర్ ఎస్.ఎస్.దిలీప్ ఆధ్వర్యంలో ఎఫెక్ట్ ఆఫ్ వేరిడ్ ట్రెనింగ్ డిజైన్స్ ఆండ్ జనరల్ మోటార్ ఏబిలిటీ అమాంగ్ ఇంటర్ కాలేజ్ బాస్కెట్‌బాల్ ప్లేయర్స్ ఎట్ హైదారాబాద్ అనే అంశంపై పరిశోధన చేశారు. ఆ పరిశోధన ఫలితంగా డాక్టరేట్ లభించినట్లు ఆయన సోమవారం ఒక ప్రకటనలో పాల్గొన్నారు. ఇటీవల జేఎన్టీయూ ఇటీవల జరిగిన స్నాతకోత్సవంలో ఇస్రో డైరెక్టర్ ఎస్.పి.సోమనాథ్, జేఎన్టీయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కట్టా నర్సింహా రెడ్డి చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నట్లు ఆయన తెలిపారు. తన శిక్షణలో జాతీయ జట్టుకు బాస్కెట్‌బాల్ క్రీడాలో ప్రాతినిధ్యం వహించేలా కృషి చేస్తానని ఈ సందర్భంగా అశోక్ తెలిపారు.

సావిత్రీబాయి జీవితం ఆదర్శప్రాయం



స్మారకోపన్యాసంలో పాల్గొన్న వక్తలు

బంజారాహిల్స్: క్రాంతిజ్యోతి సావిత్రీబాయి పూలే జయంతిని పురస్కరించుకుని అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో సోమవారం స్మారకోపన్యాసం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపారాణి 'సామాజిక న్యాయం కోసం సావిత్రీబాయి పూలే పోరాటం' అనే అంశంపై ప్రసంగించారు. సావిత్రీబాయి పూలే జీవితం సమాజానికి ఆదర్శమని, మహిళలకు సమాన అవకాశాలు కల్పించడంలో పురుషుల ఆధిపత్యాన్ని ప్రశ్నించారన్నారు. ఆధిపత్య వర్గాల నుంచి ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొన్నారని, బ్రాహ్మణ సమాజ మహిళలు ఎదుర్కొన్న సమస్యలను కూడా ప్రశ్నిస్తూ ఆ వర్గాల మహిళల హక్కుల రక్షణకు పాటుపడ్డారన్నారు. శిశు హత్యా నిరోధక గృహాలను ఏర్పాటు చేశారని, మాతా శిశు మరణాల నిరోధానికి పాటుపడ్డారన్నారు. సమాజం ఎదురించినా భర్త జ్యోతిరావుపూలే అంత్యక్రియలు తానే నిర్వహించి ఆదర్శ మహిళగా నిలిచారన్నారు. అధ్యక్షత వహించిన విశ్వవిద్యాలయ వైస్‌చాన్సిలర్ సీతారామారావు మాట్లాడుతూ... ఆదర్శ భావాలు కలిగిన సావిత్రీబాయి పూలే సమ సమాజ స్థాపనకు కృషి చేశారన్నారు. యూనివర్సిటీ అకాడమిక్ డైరెక్టర్ ఘంటా చక్రపాణి, రిజిస్ట్రార్ డాక్టర్ ఏవీఎన్ రెడ్డి, విశ్వ విద్యాలయ మహిళాభివృద్ధి సంస్థ ఇన్‌చార్జి మేరీ సునంద, సీఎస్‌టీడీ డైరెక్టర్ ఆనంద్‌పవర్, ఈఎంఆర్‌సీ డైరెక్టర్ వడ్డాణం శ్రీనివాస్, ఎడ్యుకేషన్ విభాగం డీన్ చంద్రకళ, లైబ్రరీ ఇన్‌చార్జి రజని, దయాకర్ పాల్గొన్నారు.

'కాళేశ్వరం' అవినీతిపై 26న దీక్ష

హిమాయత్‌నగర్: కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో జరిగిన అవినీతి, అక్రమాలపై ప్రభుత్వం సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ ఇందిరా పార్కు వద్ద ఈ నెల 26 తేదీన నిరసన దీక్ష నిర్వహిస్తామని నవరంగ్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు షేక్ జలీల్ ప్రకటించారు. సోమవారం బషీర్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతికి పాల్పడిన బీఆర్ఎస్ ప్రభుత్వ పెద్దలతోపాటు సంబంధిత కాంట్రాక్టర్ కృష్ణారెడ్డిపై కేసులు నమోదు చేసేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, ప్రాణహిత ప్రాజెక్టుల్లో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించాలని కోరారు. ఈ నెల 26న తలపెట్టిన దీక్షలో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని షేక్ జలీల్ కోరారు.

ఇందిరాపార్కు వాకర్స్ అసోసియేషన్‌కు ఎన్నికలు నిర్వహించాలి



పోస్టర్‌ను విడుదల చేస్తున్న రవీందర్‌రెడ్డి, సంజీవరెడ్డి తదితరులు

కవాడిగూడ: నగరంలోని అత్యంత ప్రాముఖ్యత కగల ఇందిరాపార్కు వాకర్స్ అసోసియేషన్‌కు ప్రతి సంవత్సరం ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల నిర్వాహన కమిటీ సభ్యులు వెదిరే రవీందర్‌రెడ్డి, కె.హనుమాన్‌గౌడ్, సంజీవరెడ్డిలు సోమవారం పేర్కొన్నారు. వాకర్స్‌కి ప్రతి సంవత్సరం ఎన్నికలు నిర్వహించడం వల్ల ఇందిరాపార్కులోని సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. సీనియర్ వాకర్స్‌ను గుర్తించి గుర్తింపు కార్డులను మంజూరుచేయాలన్నారు. 2007 సంవత్సరం తరువాత ఇందిరాపార్కు వాకర్స్‌కు ఎన్నికలు జరగలేదని, ప్రజాస్వామ్య బద్దంగా వాకర్స్ అసోసియేషన్‌కు ఎన్నికలు నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. ఇందిరాపార్కు అసోసియేషన్ ప్రతినిధులం అంటూ కొంతమంది చెప్పుకుంటున్నారని వారిని వాకర్స్ ఎవరూ నమ్మవద్దని అన్నారు. అనంతరం ఇందిరా పార్కులో ఎన్నికలు జరపాలంటూ వాల్‌పోస్టర్ రిలీజ్‌చేశారు.

కలుషిత నీటి నివారణకు చర్యలు



మరమ్మతు పనులను పరిశీలిస్తున్న డీజీఎం కార్తీక్‌రెడ్డి, ప్రసాద్‌బాబు

ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్ పద్మశాలీ కాలనీలో వారం రోజులుగా వస్తున్న కలుషిత నీటి నివారణకు సోమవారం జలమండలి అధికారులు చర్యలు చేపట్టారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి కలుషిత నీటికి కారణమైన పైప్‌లైన్‌ను గుర్తించేందుకు చర్యలు తీసుకున్నారు. డ్రైనేజీ మ్యాన్‌హోల్‌ను ఎయిర్‌టెక్ యంత్రాలతో శుభ్రం చేశారు. అయినా సమస్య వెలుగులోకి రాకపోవడంతో రెండు రోజుల్లో సమస్యను పరిష్కరించి ప్రజలకు మెరుగైన మంచినీటి సరఫరా చేస్తామని జలమండలి డీజీఎం కార్తీక్‌రెడ్డి, సెక్షన్ మేనేజర్లు ప్రసాద్‌బాబు తెలిపారు. అప్పటి వరకు వాటర్ ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేస్తామని కాలనీవాసులకు తెలిపారు. పద్మశాలీ కాలనీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు సుందర్ పటాలే, ఆర్.ఆంజనేయులు పాల్గొన్నారు.

మాజీ హెల్త్ డైరెక్టర్ అవినీతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

హిమాయత్‌నగర్: తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మాజీ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ గడల శ్రీనివాసరావు అవినీతి, అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని లంబాడా హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ రాజేష్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ నెల 22వ తేదీన కోఠిలోని వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయం ముట్టడిస్తామని సోమవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. మాజీ హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు తాను పదవిలో ఉన్న కాలంలో అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడి అధికార దుర్వినియోగం చేశారని ఆరోపించారు. పలు అంశాలపై 22న తలపెట్టిన కార్యాలయ ముట్టడి, ధర్నాకు భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని రాజేష్‌నాయక్ పిలుపునిచ్చారు.

మహిళ అదృశ్యం



కృష్ణవేణి

నల్లకుంట: బ్యాంక్ కాంపిటీషన్ ఎగ్జామ్ రాసేందుకు వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన సంఘటన నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్ఐ కృష్ణ సమాచారం మేరకు... వికారాబాద్ దౌలతాబాద్, పోల్కంపల్లి, కృష్ణయ నాయక్ తండాకు చెందిన నేనావత్ జయపాల్ నాయక్ భార్య ముదావత్ కృష్ణవేణి(25) బ్యాంక్ ఎగ్జామ్‌రాసేందుకు ఈ నెల 4న రాంనగర్ కృష్ణానగర్ కమాన్ సమీపంలో నివాసముండే భర్త సోదరుడు నేనావత్ రాజేందర్ నాయక్ ఇంటికి వచ్చింది. 5వ తేదీన ఉదయం మౌలాలీలో ఎస్‌బీఐ ఎగ్జామ్ రాసేందుకు వెళ్లాలని మరిదితో చెప్పింది. ఉదయం 8.30 గంటల సమయంలో మరిది రాజేందర్ నాయక్ వదినను బైక్‌పై శంకరమఠం సమీపంలోని బస్టాప్ వద్ద వదిలి వచ్చాడు. అక్కడి నుంచి ఆమె 3కే బస్సులో మౌలాలీకి వెళ్లింది. అదే రోజు మధ్యాహ్నం 2 గంటల సమయంలో జయపాల్ నాయక్ భార్య కృష్ణవేణికి ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ ఆఫ్ అని వచ్చింది. వెంటనే అతను సోదరుడికి ఫోన్ చేసి విషయం చెప్పాడు. అతను తెలిసిన వారిని, బంధువులను విచారించినా వదిన ఆచూకీ లభించలేదు. దీంతో ఆందోళన చెందిన రాజేందర్ నాయక్ సోమవారం సాయంత్రం నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సంక్రాంతి పురస్కారాల ప్రదానం



పురస్కార గ్రహీతలతో నిర్వాహకులు

చిక్కడపల్లి: వైఎస్సార్ మూర్తి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం చిక్కడపల్లిలోని ట్రస్ట్ కార్యాలయంలో సంక్రాంతి పురస్కారాలను ప్రదానం చేశారు. నాట్య కళాకారులు అరుణ, ప్రజ్ఞ, టీవీ శిరీషలకు నగదు పురస్కారాలు, అషారాణి, ప్రవళికలకు కన్సొలేషన్ బహుమతులు అందజేశారు. కవితా విభాగంలో రామకిషన్, రఘురామ మూర్తి, ఝాన్సీలు విజేతలుగా నిలిచారు. నిర్వాహకులు వైఎస్సార్ మూర్తి, నాట్య కళాకారిణి డాక్టర్ పి.ప్రవీణ, కామేశ్వరి, ప్రసాదరావు పాల్గొన్నారు.

18 నుంచి అండర్-19 టీ 20 టోర్నీ



క్రికెట్ టోర్నీ పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీహెచ్, రోహిణ్‌రెడ్డి

అంబర్‌పేట్: 43వ ఆల్ ఇండియా రాజీవ్ గాంధీ అండర్–19, డే అండ్ నైట్ టీ–20 లీగ్ క్రికెట్ టోర్నీని నగరంలో నాలుగు రోజుల పాటు నిర్వహించనున్నట్లు మాజీ ఎంపీ, క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్ వి.హనుమంతరావు తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శంబుల శ్రీకాంత్‌గౌడ్, కాంగ్రెస్ ఖైరాతాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ సి.రోహిణ్ రెడ్డితో కలిసి టోర్నీ వివరాలతో రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ నెల 18 నుంచి 21వ తేదీ వరకు టోర్నీని నిర్వహించి ప్రతిభ చూపిన క్రికెట్ క్రీడాకారులను ప్రోత్సహిస్తామన్నారు. టోర్నీ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఎం రేవంత్‌రెడ్డి హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు. ఈ టోర్నీలో రెండు దేశాలు, 12 రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటారని వారు వెల్లడించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అది అవినాష్, ఆర్.లక్ష్మణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలో అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

లిబర్టీ: పదేళ్ల భారత రాష్ట్ర సమితి పాలనలో ప్రాజెక్టుల్లో జరిగిన అవినీతి అక్రమాలపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ఒకవేళ చర్యలు తీసుకోని పక్షంలో తమ పార్టీ సీబీఐని సుప్రీం కోర్టును ఆశ్రయిస్తుందని పేర్కొన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కేసీఆర్ టీఆర్ఎస్ సర్కార్ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన వేల కోట్ల రూపాయల ఆర్థిక స్కాము అవినీతి పాల్పడిన ఘనటలపై సిట్టింగ్ జడ్జీ చేత న్యాయ విచారణ చేపట్టి బాధ్యులైన అందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎల్‌అండ్‌టి కంపెనీ రాష్ట్ర ప్రభుత్వ నీటి పారుదల విభాగడం అధికారులు కార్యదర్శులపై కేసులు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టుల డిజైన్ల పేరుతో ప్రజాధనాన్ని విచ్చలవిడిగా ఖర్చు చేసి దుర్వినియోగం చేశారని వేల కోట్ల రూపాయలు దారిమళ్లించారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ అవినీతి జరిగిందని కాంగ్రెస్ ప్రభుత్వం దగ్గర ప్రాథమిక ఆధారాలు ఉన్నందున ముఖ్యమంత్రి ఏమాత్రం వెనుకంజ వేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ముఖ్యమంత్రిని కలిసిన అమరేందర్‌రెడ్డి



రేవంత్‌రెడ్డికి మొక్కను అందజేస్తున్న దృశ్యం

లిబర్టీ: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి ఎలిమినేటి అమరేందర్‌రెడ్డి కలిశారు. సోమవారం మర్యాదపూర్వకంగా ముఖ్యమంత్రిని కలిసి పూల మొక్క అందజేసి అభినందించారు. ముఖ్యమంతి రేవంత్‌రెడ్డి సారథ్యంలో తెలంగాణ రాష్ట్రం మరింత ప్రగతి సాధిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అధికారం చేపట్టిన నెల రోజుల్లోనే అనేక కీలక నిర్ణయాలు తీసుకుంటూ రాష్ట్ర ప్రగతి కోసం ప్రజా సంక్షేమం కోసం బాటలు వేస్తున్నారని పేర్కొన్నారు.

కంటి అద్దాల పంపిణీ

ఖైరతాబాద్: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, సోషల్ వర్కర్ దివంగత కమ్మరి కృష్ణ వర్ధంతి సందర్భంగా సోమవారం ఖైరతాబాద్ రైల్వేగేట్ చౌరస్తాలో కమ్మరి కృష్ణ విగ్రహం వద్ద ఆయన తనయుడు కమ్మరి వినయ్ ఆధ్వర్యంలో సేవాకార్యక్రమాలు నిర్వహించారు. పేదలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కళ్లద్దాలు అందజేశారు. అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఖైరతాబాద్ ఏసీపీ సంజయ్‌కుమార్ పేదలకు కంటి అద్దాలను పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి, నవీన్‌యాదవ్, రాములు, అమర్‌నాథ్, మహేష్‌యాదవ్, మహేందర్‌బాబు, ప్రవీణ్, షరీఫ్ నివాళులు అర్పించారు.

స్వచ్ఛంద సంస్థలకు కేంద్రం చేయూతనివ్వాలి

లిబర్టీ: సమాజం కోసం పని చేస్తున్న సంస్థలకు కేంద్ర ప్రభుత్వం చేయూతనివ్వాలని ఆదిలీలా ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఆదినారాయణ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం కేంద్ర పర్యాటక ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. పేదరికంలో మగ్గుతున్న ప్రజలకు చేయూతనిస్తూ వారి ఆకలి కేలలు తీరుస్తున్న స్వచ్ఛంద సంస్థలకు కేంద్ర ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయి సహకారాన్ని అందించాలని ఈ సందర్భంగా ఆయనను కోరారు. పేదల ఆకలి కేకలు తీర్చడంతో పాటు వివిధ రూపాల్లో సేవలందిస్తు వివిధ రంగాల్లో పాటవాలు కనపడుతున్న వారికి అవార్డులు ఇస్తూ వివిధ అంశాలపై దేశవ్యాప్తంగా సదస్సులు గోస్టులు, సీనిరంగంలో నిష్ణాతులైన వారి స్మారకార్థం అవార్డులు ప్రదానం చేస్తున్న అంశాన్ని డాక్టర్ ఆదినారాయణ కేంద్ర మంత్రికి వివరించారు. సమాజ కోసం పేదల ఆకలి తీరుస్తున్న సంస్థలకు కేంద్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం ఉంటుందని కిషన్‌రెడ్డి వెల్లడించారు.